సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



పోలీసు నిబంధనలకు లోబడే రాజారెడ్డి పోస్టుమార్టం

పోలీసు నిబంధనలకు లోబడి రాజారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. -8లో



దొరస్వామినాయుడు సేవలు మరువలేనివి

దివంగత పాలెం దొరస్వామినాయుడు సేవలు మరువలేనివని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /27.2

వాతావరణం

జిల్లాలో గురువారం 27.2 – 36.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 16.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'మార్గదర్శి' కార్యాలయాల్లో సీఐడీ తనిఖీలు



కడపలో తనిఖీలు చేస్తున్న సీఐడీ అధికారులు

కడప అర్బన్/ప్రొద్దుటూరు క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా 'మార్గదర్శి చిట్‌ఫండ్' కార్యాలయాల్లో సీఐడీ అధికారుల బృందం గురువారం ఏకకాలంలో ఉదయం 11 గంటలకు తనిఖీలు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలో కడప, ప్రొద్దుటూరులోని కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టింది. కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా వున్న మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో జరిగిన సోదాల్లో తిరుపతి నుంచి వచ్చిన సీఐడీ అధికారులు డీఎస్పీ రాఘవన్, సీఐ ఆంజనేయప్రసాద్, ఐదుగురు సిబ్బంది పాల్గొన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని టీబీ రోడ్డులో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో ఏడుగురు అధికారుల బృందం తనిఖీలు చేశారు. రాత్రి వరకు ఈ తనిఖీలు కొనసాగాయి. పలు కీలకమైన రికార్డులను పరిశీలించారు. ప్రధానంగా పన్ను చెల్లింపులు, ఇతర కీలక రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అవసరమైన రికార్డుల ప్రతుల జిరాక్స్ తీసుకున్నారు. మరో మూడు లేక నాలుగు రోజుల పాటు కొనసాగించనున్నారు. ఈ తనిఖీలను పూర్తి చేసిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివరాలను తెలియజేస్తామని సీఐడీ అధికారుల్లో ఒకరు వెల్లడించారు.

పైడిపాలెంలో ఏపీ లోకాయుక్త



జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డిని కలిసిన అధికారులు, నాయకులు

సింహాద్రిపురం: ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి గురువారం ఆయన స్వగ్రామమైన పైడిపాలెం గ్రామానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల తహసీల్దార్ మహబూబ్ బాష, ఆర్‌ఐ షేక్షా, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు వారు శాలువా కప్పి సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేశారు. శుక్రవారం గ్రామంలో నూతన నాగులకట్ట ఆలయంలో విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు. ఆయన ఈ కార్యక్రమం ముగించుకుని వెళ్లనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

బస్సులను కండిషన్‌లో ఉంచాలి

మైదుకూరు: బస్సులను కండిషన్‌లో ఉంచాలని ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి అన్నారు. మైదుకూరు డిపోలో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. గ్యారేజిలో ప్రతి విభాగం, బస్సులను పరిశీలించారు. గ్యారేజి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. దువ్వూరు ప్రయాణికుల కోసం నిర్మిస్తున్న బస్టాండ్ స్థలాన్ని పరిశీలించారు. మైదుకూరు బస్టాండ్‌లో దుకాణాలు, ప్రయాణికుల సౌకర్యాలను తనిఖీ చేశారు. మైదుకూరు డిపో నుంచి శ్రావణ మాసం సందర్భంగా అనంతపురం జిల్లాలోని ఆంజనేయ స్వామి ఆలయాల సందర్శన కోసం బస్సులను నడిపే హనుమాన్ దర్శన్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్‌ఎం కార్యాలయం ఇన్‌చార్జి సీటీఎం శ్రీలత, మైదుకూరు డిపో ట్రాఫిక్ సూపరింటెండెంట్ మంజుల, టీఐ-2 సరోజమ్మ, జనరల్ ఏడీసీ లక్ష్మయయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ తనిఖీ



డాక్టర్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

దువ్వూరు: దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి చింతకుంట గ్రామంలోని వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు గురువారం తనిఖీ చేశారు. ఈ-సంజీవని కాల్స్ కార్యక్రమం ఎలా జరుగుతోందని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంపై ఆయన సూచనలు, సలహాలు ఇచ్చారు. చింతకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గ్రామంలోని ఉర్దూ పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు ఆల్‌బెండజోల్, ఐరన్ మాత్రలు మింగించారా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సమీర, చింతకుంట వైద్యాధికారి డాక్టర్ వికసిత, హెల్త్ సూపర్‌వైజర్ మురళీధర్, సిబ్బంది సౌభాగ్యలక్ష్మి, సుజాతమ్మ, వెంకటరెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడ్డారు.. కల నెరవేర్చారు..!

గ్రూప్-1 ఫలితాల్లో సత్తా చాటిన యువత

వారందరూ సామాన్య, రైతు కుటుంబాలకు చెందిన వారు.. అందరిదీ ఒకటే లక్ష్యం.. అమ్మనాన్నల కల నెరవేర్చడం.. చిన్నతనం నుంచి కష్టపడ్డారు.. క్రమశిక్షణతో చదువుకున్నారు.. ఒక్కో మెట్టు ప్రణాళికతో ఎక్కారు. గురువారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో విజయం సాధించారు.. అత్యుత్తమ ఫలితాలతో ఉన్నత కొలువులు సాధించారు.. తమ, తల్లిదండ్రుల కల నెరవేర్చారు.. వారి విజయ గాథపై స్ఫూర్తిదాయక కథనాలు.



డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన సాయి హర్షితకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

మెకానిక్ ఇంట సరస్వతీ పుత్రుడు

అట్లూరు: మోటారు మెకానిక్ పని చేసుకుని జీవనం సాగించే వ్యక్తి కుమారుడు గ్రూప్-1కు ఎంపికై శభాష్ అనిపించుకున్నాడు. మండల పరిధిలోని గోపినాధపురం గ్రామానికి చెందిన మెంటా నాగమల్లయ్య, సరస్వతి కుమారుడు మెంటా మల్లికార్జున జార్ఖండ్‌లో ఐఐటీ పూర్తి చేసి మొదట సారిగా గ్రూప్-1 రాశాడు. మొదటి ప్రయత్నంలోనే గ్రూ-1లో సెక్రటరీ అండ్ ట్రెజరీ గ్రేడ్-2 ఇన్ మెడికల్ అండ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసులో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా ఎంపిక అయ్యాడు. మల్లికార్జున తండ్రి వ్యవసాయ మోటార్ల



మెంటా మల్లికార్జున

వైరింగ్, మెకానిక్ పనులు చేసుకుని జీవనం సాగిస్తూ కుమారుడిని చదివించాడు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1లో ఉద్యోగం సాధించడంతో ఆయన ఆనందానికి అవధులు లేవు. అలాగే మండల వ్యాప్తంగా మల్లికార్జునను ప్రశంసిస్తున్నారు.

తండ్రి కష్టాన్ని చూసి..

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మేదర వీధికి చెందిన వంకం సాయిహర్షిత డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించింది. తండ్రి వంకం వెంకటసుబ్బయ్య ఫ్రిడ్జ్ మెకానిక్‌గా పని చేస్తుండగా, తల్లి శారద గృహిణి. సోదరుడు హర్షవర్దన్ కడప కేఎస్‌ఆర్‌ఎం కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయి హర్షిత 1 నుంచి 7వ తరగతి వరకు మహర్షి హైస్కూల్, 8 నుంచి పదవ తరగతి వరకు శ్రీ చైతన్య పాఠశాలలో చదివింది. 10లో 9.7 జీపీఏ సాధించింది. ఇంటర్ విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఎంపీసీ 924 మార్కులు సాధించింది. బీటెక్ కడప కేఎల్‌ఎం కళాశాలలో ఈసీఈ చదివి 85 శాతం మార్కులు తెచ్చుకుంది. తండ్రి తమను చదివించేందుకు పడుతున్న కష్టాన్ని చూసి ఉన్నత ఉద్యోగం సాధించాలని కసితో చదివి ఉద్యోగం సాధించింది. తండ్రి వెంకటసుబ్బయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఫీజురీఇంబర్స్‌మెంట్ వల్లనే తన కూతురిని బాగా చదివించినట్లు తెలిపాడు.

సొంతంగా ప్రిపేర్ అయ్యాను

బీటెక్ పూర్తి కాగానే 2021లో ఏపీపీఎస్సీకి ఇంటిలోనే సొంతంగా సన్నద్ధం అయ్యాను. ఒకటిన్నర సంవత్సరం కాలంలో ఏపీపీఎస్సీ సిలబస్‌ను ప్రిపేర్ కావడంతోపాటు వివిధ అంశాలపై పరీక్షలు రాశాను. – సాయిహర్షిత, ప్రొద్దుటూరు

స్వతహాగా సన్నద్ధమై..

కలసపాడు : మండలంలోని దూలంవారిపల్లె దళితవాడకు చెందిన ఒడ్డెపోగు శామ్యూల్‌డెన్నీ అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా ఎంపికయ్యారు. పేద కుటుంబానికి చెందిన పీటర్ రాయప్ప, మరియమ్మ కుమారుడైన శామ్యూల్‌డెన్నీ ప్రస్తుతం పోరుమామిళ్ళ మండలంలోని దమనపల్లె పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. స్వతహాగా సన్నద్ధమై గ్రూప్-1 పరీక్షల్లో అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన భార్య సౌమ్యలీనారాణి వ్యవసాయ విస్తరణాధికారిగా పని చేస్తున్నారు.



శామ్యూల్‌డెన్నీ

ఐఏఎస్ కావడమే లక్ష్యం

రాజంపేట : నందలూరు మండలం గొల్లపల్లెకు చెందిన గొబ్బిళ్ల శ్రీకృష్ణ శ్రీవాత్సవను జిల్లా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారిగా నియమించారు. ఈయన సోదరి విద్యాధరి నెల్లూరులో ట్రైనీ కలెక్టరుగా పని చేస్తున్నారు. తండ్రి గొబ్బిళ్ల సుబ్బరామయ్య, గొబ్బిళ్ల సుజాత ఏకైక కుమారుడు కృష్ణశ్రీ. ఈయన తల్లితో కలిసి ప్రస్తుతం చెన్నైలో ఉంటున్నారు. అనంతపురం జేఎన్‌టీయులో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించారు. గొబ్బిళ్ల కృష్ణశ్రీ వాత్సవ మాట్లాడుతూ ఐఏఎస్ కావడం తన లక్ష్యమన్నారు.



కృష్ణశ్రీ వాత్సవ

ఇకపై డీఎస్పీ భవాని

కదిరి: అనంతపురం జిల్లా తలుపుల మండలం గంజివారిపల్లికి చెందిన టి.భవాని డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో డిప్యూటీ తహసిల్దార్‌గా పని చేస్తున్నారు. అంతకు మునుపు గ్రూప్-2లో ఎంపికై వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో కూడా పని చేశారు. తండ్రి చెన్నక్రిష్ణ కదిరిలో ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. భవాని డీఎస్పీగా ఎంపిక కావడం పట్ల ఆమె తల్లిదండ్రులు సంతోషం వెలిబుచ్చారు.



భవాని

తొలి ప్రయత్నంలోనే..

కొండాపురం: కొండాపురానికి చెందిన బొడెల ఈశ్వర్‌రెడ్డి, సువర్ణ దంపతుల కుమార్తె సుజిత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఎంపిక అయ్యారు. ఆమె ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ముద్దనూరు మండలం మంగపట్నం సమీపంలోని థెరిస్సా డీలిమా పాఠశాలలో చదివింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేసింది. 2021 నుంచి సివిల్స్‌కు ప్రిపేర్ అయింది. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్ వన్ అధికారిగా ఉత్తీర్ణత సాధించింది.



బొడెల సుజిత

పట్టువదలని విక్రమార్కుడిలా..

గోపవరం: మండలంలోని బ్రాహ్మణపల్లె పంచాయతీ ఓబులరెడ్డినగర్ గ్రామానికి చెందిన పల్లం శ్రీనివాసులు ఎక్సైజ్ డీఎస్పీగా పని చేస్తూ గ్రూప్-1 ఫలితాల్లో సివిల్ డీఎస్పీగా ఎంపికయ్యారు. గతేడాది జులైలో విడుదలైన గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో ఎక్సైజ్ డీఎస్పీగా ఎంపికయ్యారు. ట్రైనింగ్ పూర్తి చేసుకుని మన్యం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. మళ్లీ 2022లో గ్రూప్-1 పరీక్ష రాసి సివిల్ డీఎస్పీగా ఎంపికయ్యారు. నరసింహులు, లక్షుమ్మల కుమారుడైన శ్రీనివాసులు 2012 నుంచి ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ప్రొద్దుటూరులో పని చేశాడు. పట్టువదలని విక్రమార్కుడిలా ఎట్టకేలకు అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. కాగా శ్రీనివాసులు తల్లిదండ్రులు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రూప్-1లో వరుసగా ఎక్సైజ్ డీఎస్పీ, సివిల్ డీఎస్పీగా ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులతోపాటు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కరెంట్ అఫైర్స్ కోసం యోజన, కురుక్షేత్ర మ్యాగజైన్లను చదవడం, గత పరీక్ష పత్రాలు ప్రిపేర్ అవడం, ఏపీపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం కావడం గ్రూప్‌వన్ విజయానికి తోడ్పడిందని శ్రీనివాసులు తెలిపారు. వివిధ అంశాలపై పరీక్షలు, చాలా టెక్ట్ సీరీస్‌లు రాశానని పేర్కొన్నారు.



శ్రీనివాసులు

భర్త, అత్తమామల సహకారంతో..

బద్వేలు అర్బన్ : కృషితో నాస్తి దుర్భిక్షం అన్న పదానికి సిసలైన నిదర్శంగా నిలిచింది ఆ యువతి. మొదటి ప్రయత్నంలో విజయం అంచుల దాకా వెళ్లి వెనుదిరిగినప్పటికీ ఏమాత్రం అధైర్యపడకుండా రేయింబవళ్లు యజ్ఞంలా శ్రమించింది. మరోవైపు భర్త, తల్లిదండ్రులు, అత్తామామల సహకారం ఆమెను విజయతీరాలకు చేర్చింది. బద్వేలుకు చెందిన అంకిరెడ్డిపల్లె శివప్రియారెడ్డి డీఎస్పీగా ఎంపికై ంది. జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన అంకిరెడ్డిపల్లె రామశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె శివప్రియారెడ్డి పదో తరగతి వరకు ప్రొద్దుటూరులోని గోపికృష్ణ స్కూల్‌లో చదివింది. ప్రొద్దుటూరులోని షిరిడిసాయి కళాశాలలో ఇంటర్మీడియెట్, రాజంపేట సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసింది. ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ 2018లో గ్రూప్-1 పరీక్షకు హాజరైంది. తొలి ప్రయత్నంలో విజయం దక్కలేదు. 2021లో బద్వేలుకు చెందిన పెసల మణికాంత్‌రెడ్డితో వివాహం జరిగింది. భర్త, అత్తమామలు మల్లేశ్వర్‌రెడ్డి, సరస్వతిల ప్రోత్సాహంతో తిరిగి 2022లో గ్రూప్-1 పరీక్షకు హాజరై ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించి సివిల్ డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు.



శివప్రియారెడ్డి

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా
- కడపలో జగనన్న మార్ట్ ప్రారంభం



జగనన్న మార్ట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: మహిళా సాధికారతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్ దిశ పోలీస్‌స్టేషన్ వద్ద పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మెప్మా బజార్(జగనన్న మార్ట్)ను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించి వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మెప్మా వారి ఆధ్వర్యంలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులన్నీ సులువుగా అమ్ముకోవడానికే అర్బన్ మెప్మా బజార్ ప్రారంభించడం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే ఇవ్వడం జరుగుతోందని అన్నారు. తద్వారా రాష్ట్రంలో మహిళాభివద్ధి ఈ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కుటుంబ బరువు బాధ్యతలన్నీ వారే మోస్తారని నమ్మిన వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసినట్లు పేర్కొన్నారు. సంఘాలకు ఉన్న రుణాలన్నీ నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని చెప్పారని, మాట ఇచ్చినట్లుగానే వైఎస్సార్ ఆసరా ద్వారా మూడు విడతలు మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని చెప్పారు. 40 నుంచి 60 ఏళ్లు ఉన్న మహిళలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 అందజేస్తున్నారని పేర్కొన్నారు. 'ఆహా క్యాంటీన్' ఒక అద్భుతమైన కాన్సెప్ట్ అని అన్నారు. ఎక్కడైనా భోజన సదుపాయాలు లేనిచోట స్వయం సహాయక సంఘ మహిళలు పట్టణ ప్రాంతంలో 'ఆహా క్యాంటీన్' లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో కూడా అమ్ముకునే అవకాశం ఉందని, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తరహాలో జగనన్న మార్ట్‌ల ద్వారా సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. మెప్మా ఎండీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ అర్బన్ మార్కెట్‌ను ప్రతి నెలలో రెండు రోజుల పాటు నిర్వహించాలన్నారు. అర్బన్ మార్కెట్ ప్రారంభం సందర్భంగా 2902 మంది పీఎం స్వనిధి, జగనన్న తోడు లబ్ధిదారులకు రూ.4.65 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, స్టేట్ మిషన్ కో ఆర్డినేటర్లు ఆదినారాయణ, రంగాచారి, శ్రీనివాస్, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్లు అజ్మతుల్లా ఖాన్, ఎస్‌ఎండీ షఫీ, సీఓలు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌పై మేధోమథనం అవసరం

- పలువురు కార్పొరేటర్ల డిమాండ్
- సాయి మౌర్య కేసులో ఆర్బిట్రేటర్‌ను నియమించాలి
- ఎకోపార్కుపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి
- వాడివేడిగా నగరపాలక సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మేయర్ కె.సురేష్‌బాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థలో అమలవుతున్న మాస్టర్‌ప్లాన్‌పై మేధోమథనం జరగాలని పలువురు కార్పొరేటర్లు పట్టుబట్టారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, కమిషనర్ ప్రవీణ్‌చంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు పాకా సురేష్, మగ్బూల్‌బాషా మాట్లాడుతూ 2020లో మాస్టర్‌ప్లాన్ నోటిఫికేషన్ ఇచ్చారని, 2022లో అభ్యంతరాలు స్వీకరించి, 2023 మార్చిలో ఆమోదించారన్నారు. 2022లో కోవిడ్ తీవ్రత ఎక్కువగా ఉన్నందున స్టేక్ హోల్డర్స్ మీటింగ్ పెట్టి అభ్యంతరాలు స్వీకరించలేదని, అశాస్త్రీయంగా చేసిన ఈ మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తే ప్రజల్లోకి వెళ్లడం కష్టమవుతుందని పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఏ రోడ్డు ఎంత వెడల్పు ఉందనే దానిపై కార్పొరేటర్లకు అవగాహన లేనందున ప్రత్యేక సమావేశం నిర్వహించి, మార్పులు, చేర్పులు చేసి ప్రభుత్వానికి పంపాలని తీర్మానించారు. 40వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంతంలో ఎక్కువగా క్రిస్టియన్ మిషనరీ వారు ఇచ్చిన స్థలాలు ఉన్నాయని, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆధారంగా మ్యూటేషన్లు చేయాలన్నారు.

- పాత మున్సిపల్ కార్యాలయ స్థలాన్ని గతంలో సాయి మౌర్య ఇన్‌ఫ్రా వారికి లీజుకు ఇవ్వడం జరిగిందని, ఆ తర్వాత నగరపాలక సంస్థ ఆ లీజును రద్దు పరచగా వారు కోర్టును ఆశ్రయించారన్నారు. ఆర్బిట్రేటర్‌ను నియమించుకొని పరిష్కరించుకోవాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా, నగరపాలక అధికారులు ఇంత వరకూ ఆర్బిట్రేటర్‌ను నియమించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మగ్బూల్‌బాషా, పాకా సురేష్ అన్నారు. వెంటనే ఆర్బిట్రేటర్‌ను నియమిస్తామని కమిషనర్ సమాధానమిచ్చారు.
- నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకులో డిజిటల్ లావాదేవీలతోపాటు నగదు లావాదేవీలు కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మల్లికార్జున కోరారు. నాగరాజుపేట లా కాలేజీకి పోయే మార్గంలో ప్రజలు నష్టపోకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కార్పొరేటర్ షఫీ కోరారు.
- వై జంక్షన్ నుంచి సంజన్న సర్కిల్ వరకూ ఉండే వరదనీటి కాలువ వెడల్పు తగ్గిపోయిందని, లెవెల్స్ కూడా సరిగా లేవని, దీన్ని కొత్తగా నిర్మించాలని 12వ డివిజన్ కార్పొరేటర్ సానపురెడ్డి శివకోటిరెడ్డి కోరారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి నిర్మించే డ్రైనేజీ కాలువలో లెవెల్స్ పాటించడం లేదని కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి తెలిపారు.
- కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎండీ జహీర్ మాట్లాడుతూ తమ డివిజన్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, దేవునికడప రోడ్డును ఎక్కడ ఎంత విస్తరణ చేస్తున్నారు, కాలువలు ఎంత లోతు తీస్తారు అని ప్రజలు అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో కుళాయిల్లో సరఫరా అవుతున్న మురికినీటిని 1వ డివిజన్ కార్పొరేటర్ చెన్నయ్య, 27వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ అరీఫ్‌లు బాటిళ్లలో తెచ్చి చూపించారు.
- మాసాపేట కొత్తకొట్టాలు ప్రాంతాన్ని బక్కా అయ్యన్న కాలనీగా నామకరణం చేయాలని, మాసాపేట సర్కిల్- మాచుపల్లి రోడ్డులో అయ్యన్న విగ్రహం ఏర్పాటు చేయాలని 26వ డివిజన్ కార్పొరేటర్ సి.నాగమణి కోరారు.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను ఏ ఉద్దేశంతో తీసుకొచ్చారో ఆ ఉద్దేశం నెరవేరడం లేదని, సెక్రటరీలు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో తెలియడం లేదని 28, 25 డివిజన్ల కార్పొరేటర్లు అరీఫుల్లా బాషా, కె.సూర్యనారాయణరావు చెప్పారు. దీనిపై డిప్యూటీ సీఎం జోక్యం చేసుకుంటూ సచివాలయాలపై పర్యవేక్షణ ఉండాలని, ప్రతి సచివాలయంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలన్నారు.
- విద్యుత్ స్తంభాలు మార్చాలని డబ్బు కట్టి ఆరునెలలైనా విద్యుత్ శాఖ అధికారులు మార్చలేదని కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి తెలిపారు. రోడ్డు మధ్యలో ఉన్నవి, దెబ్బతిన్న స్తంభాలనైనా వెంటనే మార్చాలి కదా అని డిప్యూటీ సీఎం అధికారులను ప్రశ్నించారు. నజరీ నక్ష డోర్ నంబర్లు లేకపోవడం వల్ల కొత్త ఓటర్లు నమోదు చేయించడంలో ఇబ్బంది అవుతోందని కార్పొరేటర్ అజ్మతుల్లా పేర్కొన్నారు.
- ఉక్కాయపల్లెలో పాత కంపోస్టుయార్డు స్థలంలో నిర్మించిన ఎకో పార్కు నిర్మాణంలో టెండర్ నిబంధనలు పాటించలేదని సభ్యుడు పాకా సురేష్ ఆక్షేపించారు. రూ.30 కోట్లతో నిర్మించిన ఆ పార్కుపై విజిలెన్స్ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.
- 25 ఏళ్లు పూర్తయిన షాపు రూములకు సంబంధించి కార్పొరేటర్లు, అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేశారని, కానీ కమిటీ ఇచ్చిన సూచనలను కాదని అధికారులే నిర్ణయాలు తీసుకుంటున్నారని పాకా సురేష్ అన్నారు.
- దేవునికడప రోడ్డు నుంచి కేసీ కెనాల్ మీదుగా వేస్తున్న రోడ్డుకు డాక్టర్ ఏపీజే అబ్దుల కలాం రోడ్డుగా నామకరణం చేయాలని 34వ డివిజన్ కార్పొరేటర్లు నసీబా సుల్తానా, గౌస్ జబీన్ కోరారు.
- సమావేశంలో డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, బి.నిత్యానందరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు బండి జయమ్మ, శిరీష, సుజాత, శ్రీదేవి, కో ఆప్షన్ సభ్యులు పత్తి రాజేశ్వరి, బండి మరియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందంజలో ఉన్నాం : మేయర్

అభివృద్ధి పరంగా రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్ల కంటే మనమే ముందున్నామని మేయర్ సురేష్ బాబు అన్నారు. రెండేళ్లు కోవిడ్ వల్ల ఇబ్బంది పడినా, మిగతా రెండేళ్లలో చాలా అభివృద్ధి సాధించామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున.. మొదలు పెట్టిన పనులను పూర్తి చేసుకోవాలన్నారు. రోడ్ల విస్తరణ, వరదనీటి కాలువలను త్వరగా నిర్మించుకోవాలన్నారు. నూతన కార్పొరేషన్ కార్యాలయాన్ని కూడా యుద్ధప్రాతిపదికన నిర్మించాలన్నారు. కేంద్రం ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకొని పురోగతి సాధించాలని తెలిపారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి : డిప్యూటీ సీఎం

గౌస్ నగర్, గంజికుంట కాలనీల్లో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆదేశించారు. దేవునికడప, గౌస్ నగర్ ప్రాంతాల్లో తాగునీరు చాలా కలుషితమై, దుర్వాసనతో వస్తుందన్నారు. నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా నగరపాలక అధికారులు పరిష్కరించలేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎన్ని రోజులు కావాలని ప్రశ్నించారు. చెత్త స్వీకరణకు సంబంధించిన యూజర్ చార్జీలను పింఛన్‌లో పట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పాత రిమ్స్‌లో వాణిజ్య సముదాయాలు నిర్మించాలి: ఎమ్మెల్సీ



పాత రిమ్స్ ఆవరణలో ఉన్న పాత భవనాలన్నీ కూల్చివేసి వాణిజ్య సముదాయాలు నిర్మించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి సూచించారు. క్రిస్టియన్ లేన్, ఐటీఐ సర్కిల్ ప్రాంతంలో రోడ్ల విస్తరణ చేపట్టాలని, నగర శివారు ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. పాత కలెక్టరేట్‌ను మ్యూజియంగా, సైన్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలన్నారు. వర్షపునీరు నిలవకుండా వరదనీటి కాలువలు నిర్మించాలని తెలిపారు.

బైకు అదుపుతప్పి యువకునికి గాయాలు


గాయపడిన రాజు

పెండ్లిమర్రి : కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని వెల్లటూరు పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురువారం వీరపునాయునిపల్లె మండలం అడవి చెర్లోపల్లె గ్రామానికి చెందిన కె.రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు రాజు కొప్పర్తి ఈఎంసీలోని డిక్సన్ కంపెనీలో పని చేస్తున్నాడు. రాత్రి విధులు ముగించుకొని ఉదయం ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా వెల్లటూరు పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

ట్రాక్టర్ ట్రాలీలోని రాయి మీద పడి..


గాయపడిన గౌస్‌మొహిద్దీన్

వీరపునాయునిపల్లె : ఎర్రగుంట్ల–వేంపల్లె ప్రధాన రహదారిలోని అయ్యవారిపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ గౌస్‌మొహిద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎర్రగుంట్ల–వేంపల్లె ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా హద్దులను ఏర్పాటు చేసేందుకు ట్రాక్టర్ ట్రాలీలో కూలీలు రాళ్లు తరలిస్తుండగా స్కూటీలో గంగిరెడ్డిపల్లెకు వెళుతున్న గౌస్‌మొహిద్దీన్‌పై రాయి పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయని ఎస్‌ఐ రమణ తెలిపారు. గాయపడిన వ్యక్తి వద్ద రూ.35వేల నగదు ఉండటంతో గంగిరెడ్డిపల్లెలోని అతని బంధువులకు అప్పగించారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూజ స్కూల్‌పై ఆందోళన వద్దు

- సోమవారం నుంచి తరగతులు నిర్వహిస్తాం
- ఆర్డీఓ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పూజ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం నుంచి తరగతులు నిర్వహిస్తామని, హాస్టల్ కొనసాగుతుందని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పూజ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఈఓ రాఘవరెడ్డిలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాజారెడ్డి ఉన్నప్పుడు పాఠశాల ఎలా కొనసాగిందో ఇప్పుడు అలాగే కొనసాగుతుందని పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్, ఎస్పీలు ఆర్డీఓ, డీఈఓ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, సహకార శాఖ అధికారితో కమిటీని ఏర్పాటు చేశారన్నారు. రాజారెడ్డి ఏర్పాటు చేసిన ట్రస్టుతో కలిసి ఈ కమిటీ పాఠశాల నిర్వహణకు తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రతి ఆదివారం సమావేశమై పాఠశాల కార్యకలాపాలు పరిశీలిస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు భయం లేకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ట్రస్టు సభ్యులు, కలెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు మినహా ఇతరులు ఎవ్వరూ పాఠశాలలోకి రావడానికి అనుమతించమని తెలిపారు. డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తుకు ఏ ఇబ్బంది లేదని ఎవరైనా ఉపాధ్యాయులు వెళ్లిపోతే ప్రభుత్వ ఉపాధ్యాయులతో బోధన కొనసాగిస్తామన్నారు. రాజారెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలను కొనసాగించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. సీఐ ఇబ్రహీం మాట్లాడుతూ పాఠశాలలో పోలీసు భద్రత ఏర్పాటు చేస్తామని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ నజీర్ అహ్మద్, సీఐ ఇబ్రహీం, ప్రిన్సిపాల్ జాన్సన్, రూరల్ ఎస్‌ఐ చిరంజీవి, మైలవరం, జమ్మలమడుగు ఎంఈఓలు, రాజా ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ రాధ, సీఈఓ కవిత, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ

- ఒకరి మృతి
- ముగ్గురికి గాయాలు


పి.సుబ్బిరెడ్డి (ఫైల్)

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని ఎర్రగుంట్ల–ప్రొద్దుటూరు మార్గంలో గురువారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని ఎర్రగుంట్ల పోలీసులు పరిశీలించారు. పోట్లదుర్తి గ్రామానికి చెందిన పి.సుబ్బిరెడ్డి, బి.ప్రదీప్‌లు బైకుపై ఎర్రగుంట్ల నుంచి పోట్లదుర్తికి బయలు దేరారు. అదే సమయంలో ప్రొద్దుటూరు నుంచి మరో బైకుపై వస్తుండగా ఎర్రగుంట్ల సమీపంలోని కల్యాణ మండపం వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుబ్బిరెడ్డి, ప్రదీప్‌లతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన సుబ్బిరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. క్షతగాత్రులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శించారు.

పాలెం దొరస్వామినాయుడు సేవలు మరువలేనివి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


దొరస్వామినాయుడు విగ్రహావిష్కరణలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, దొరస్వామినాయుడు కుటుంబ సభ్యులు

పులివెందుల : పులివెందుల ప్రాంతానికి చెందిన దివంగత పాలెం దొరస్వామినాయుడు సేవలు మరువలేనివని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ మోడల్ పాఠశాలలో దివంగత పాలెం దొరస్వామి నాయుడు విగ్రహాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, దొరస్వామి నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర గల గొప్ప వ్యక్తి దొరస్వామినాయుడు విగ్రహాన్ని వారి కుటుంబ సభ్యులు, మునిమనుమరాళ్లతో కలిసి ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. 1909వ సంవత్సరంలో ఎంతో ఉన్నతమైన ఆలోచనలతో పులివెందుల ప్రాంతంలో హైస్కూలు కూడా లేని రోజులలో రాయచోటి తాలుకా కింద పులివెందుల ఉన్న సమయంలో రాయచోటి, పులివెందుల ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని దొరస్వామి నాయుడు తన సొంత నిధులతో 7ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇక్కడ హైస్కూలును ఏర్పాటు చేశారన్నారు. ఆ స్కూలుకు రైతుల స్కూలుగా నామకరణం చేశారని తెలిపారు. 1925వ సంవత్సరంలో దొరస్వామి నాయుడు మరణించే వరకు వేలాది మంది విద్యార్థులకు చదువు చెప్పించారన్నారు. పేద విద్యార్థులకు భోజన వసతిని సొంతంగా ఏర్పాటు చేయడమే కాకుండా ఉపకార వేతనాలను కూడా ఆయన సొంతంగా అందించారని కొనియాడారు.

దొరస్వామినాయుడుకు సీఎం వైఎస్ జగన్ గొప్ప నివాళి

దొరస్వామినాయుడు మంచి ఆలోచన, సంకల్పంతో హైస్కూలు ఏర్పాటు చేశారని.. ప్రస్తుతం మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అలాంటి ఆలోచనలు, ఆశయాలతో ఆనాడు నిర్మించిన హైస్కూలును ఒక అడుగు ముందుకేసి మోడల్ స్కూలుగా తీర్చిదిద్దారన్నారు. దీనిని పాలెం దొరస్వామి నాయుడుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన గొప్ప నివాళిగా చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, దొరస్వామినాయుడు కుటుంబ సభ్యులు బలరాం, శివ, బలిజ సంఘం నాయకులు ప్రసాద్, యార్వ వెంకటసుబ్బయ్యలతోపాటు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

కడపలో వ్యాపార సంస్థలపై విజిలెన్స్ దాడులు


వ్యాపార సంస్థల కార్యాలయాల్లో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారుల బృందం

కడప అర్బన్ : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు గురువారం కడప కోటిరెడ్డి సర్కిల్, రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెస్ సర్కిల్, వై జంక్షన్‌కు దగ్గరగా వున్న శ్రీరాం వుడ్స్‌ను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. వీరితో పాటు కడప మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన టౌన్ ప్లానింగ్ అధికారి బిల్డింగ్ ప్లానింగ్ ప్రకారం అనుమతుల మేరకు కట్టారా, బిల్డింగ్‌కు సంబంధించిన సెట్ బ్యాక్స్ వదిలారా లేదా అని, జీఎస్‌టీ అధికారులు జీఎస్‌టీ మంత్లీ రిటర్న్స్ ఫైలింగ్ చేశారా లేదా, లేబర్ డిపార్ట్‌మెంట్ వారు అందులో పనిచేస్తున్న వారికి వేతనాలు సక్రమంగా చెల్లిస్తున్నారా, వారి పనిగంటలు ఫాం–సి రెన్యువల్, అన్యువల్ రిటర్న్స్, వారి వసతులు పరిశీలించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ వారి అనుమతులున్నాయా, లేవా అని తనిఖీ చేశారు. ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ వారు నెలవారీ బిల్లులు చెల్లిస్తున్నారా లేదా, కమర్షియల్ కేటగిరిలో ఉందా లేదా అని పరిశీలించారు. రెవెన్యూ శాఖవారు ఈ తనిఖీలలో పాల్గొన్నారు. ఈ వ్యాపార సంస్థల్లో తాము తనిఖీలు చేసిన అంశాలలో లోటుపాట్లను ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా అందజేస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో పాల్గొన్న అధికారులలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ జి. ఈదురుబాషా, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ. బాలగంగాధర్ రెడ్డి, ఏఈఈ వి.అశోక్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ వి. రామారావు, డీసీటీఓ త్రిమూర్తినాయక్, లేబర్ ఆఫీసర్ జి. శ్రీనివాసరెడ్డి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి. బసివిరెడ్డి, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ సి. సురేష్, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్. జనార్దన్‌రావు, కానిస్టేబుళ్లు డి. హరినాథరెడ్డి, ఎం. కృష్ణా నాయక్‌లు ఉన్నారు.

పసుపు కొనుగోలులో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి


ఏఓతో మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యాన శాఖ కమిటీ సలహాదారు ప్రసాద్‌రెడ్డి

ఒంటిమిట్ట : పసుపు కొనుగోలులో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌బీకేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, ఆర్‌బీకే సిబ్బందికి ఈ క్రాప్ సమయంలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పసుపు కొనుగోలులో జరిగిన అక్రమాలపై ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టాయని అందులో దోషులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. ఇది రైతు సంక్షేమం కోరే ప్రభుత్వం అని భరోసా ఇచ్చారు. అలాగే ఖరీఫ్‌లో రైతులు ఎలాంటి పంటలు వేయాలో స్థానిక ఆర్‌బీకేలో ఉన్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సలహాలను తీసుకోవాలని సూచించారు. రైతులకు ఏనాడు ఉపకారం చేయని టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 2014లో రుణమాఫీ అని రైతులకు ఆశ చూపారన్నారు. అప్పట్లో రైతులకు ఉన్న రూ.85 వేల కోట్ల రుణాన్ని తీర్చలేక లేని పోని ఆంక్షలు విధిస్తూ కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని విమర్శించారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కావాల్సిన తారపట్టలు, స్ప్రేయర్లు, రోటావేటర్లు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియదర్శిని పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్ కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

- జైలు శిక్షతో పాటు రూ. 20వేలు జరిమాన
- రెండేళ్ల క్రితం చిన్నచౌక్ పీఎస్ పరిధిలో ఘటన


ముద్దాయి శశికుమార్

కడప అర్బన్ : రెండేళ్ల క్రితం కడప నగరంలోని చిన్నచౌక్ పోలీసు స్టేషన్ పరిధిలో మహిళను తీవ్రంగా గాయపరిచి ఆమె మెడలో బంగారు గొలుసును కాజేసి, పారిపోయిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు వల్లపు శశికుమార్ అలియాస్ నానికుమార్ అలియాస్ శశి(23)కి గురువారం ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 20వేలు జరిమాన విధిస్తూ కడప అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ తీర్పును ఇచ్చారు.

ఈ కేసు వివరాల్లోకి వెళితే...2021 సెప్టెంబర్ 10న సాయంత్రం 6:10 గంటల సమయంలో కడప నగరం ఎన్జీఓ కాలనీలో నివాసం ఉంటున్న గరిసా సరోజనమ్మ (27)పై నిందితుడు శశికుమార్ తన చేతిలోని కోడికత్తితో దాడి చేశాడు. ఆమె మెడలోని బంగారుచైన్‌లను పట్టుకుని నీవు అరిస్తే చంపుతాను... నీ మెడలో ఉన్న బంగారుచైన్‌లను ఇవ్వమని బెదిరించాడు. బాధితురాలు ఎదురుతిరగగా, సదరు నిందితుడు బాధితురాలి ఎడమ కన్నుభాగాన, గడ్డం ఎడమవైపున, గొంతు దగ్గర పొడిచాడు. దీంతో ఆమెకు బలమైన రక్తగాయాలయ్యాయి. ఆమె కేకలు వేయగా, ఇంటిలోని ఆమె ఇద్దరు పిల్లలు, చుట్టుపక్కల వాళ్లు అరుపులు విని రావడంతో నిందితుడు ఆమె మెడలోని 15 గ్రాముల బరువైన రూ.60 వేలు విలువ చేసే బంగారు నల్లపూసల దండతో పారిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 221/21 యు/ఎస్ 394, 397 ఐపీసీ సెక్షన్‌ల కింద అప్పటి సీఐ కె. అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి చార్జిషీటు వేశారు. కోర్టుమానిటరింగ్ సెల్ సీఐ బి.వి మధుసూదనరావు, ప్రస్తుత సీఐ పి. నరసింహారెడ్డి పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది ఎం.ఆసిఫ్‌ఖాన్ (ఏఎస్‌ఐ–140), ఎం. సుబ్బరాయుడు(హెచ్‌సి 719), చిన్నచౌక్ ప్రాసెస్ పి.సి కె.నాగేంద్రరెడ్డి (పిసి 642)లు సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యు. శేషయ్య, తన వాదనలు వినిపించారు. సరైన సాక్ష్యాధారాలతో నిందితుడికి కఠినశిక్ష పడేలా చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి

చక్రాయపేట : మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం బీఎస్ తాండాకు చెందిన ఇస్లావత్ రవి నాయక్ గురువారం బీఎస్ తాండాకు చెందిన నాయుడు నాయక్ ఆధ్వర్యంలో మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిలు మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నందున తాను వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు రవినాయక్ తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ వర్క్‌షాప్ అటెండెంట్స్

ప్రొద్దుటూరు : ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కాంట్రాక్ట్ వర్క్ షాప్ అటెండెన్స్‌గా పనిచేస్తున్న 144 మందిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించడంపై ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ వర్క్‌షాప్ అటెండెంట్స్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మైదుకూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి వారు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో బతుకుతున్న తమ జీవితాల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి వెలుగులు నింపారన్నారు. ఆయన రుణం తీర్చుకోలేమని తెలిపారు.

గాయపడిన నెమలిని కాపాడిన పోలీసు

రాజంపేట : రాజంపేట–రాయచోటి మార్గంలోని ఎస్‌ఆర్‌పాళెం(రాజంపేట రేంజ్) సమీపంలో గాయాలతో రోడ్డుపై పడి విలవిల్లాడుతున్న నెమలి నందలూరు పోలీసు స్టేషన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రరావుకు బుధవారం తారసపడింది. సానిపాయి నుంచి రాజంపేటకు వస్తుండగా సొమ్మసిల్లిపడి ఉన్న నెమలిని తీసుకుని వెళ్లి రాజంపేట రేంజర్ నారాయణకు అప్పగించారు. నెమలికి చికిత్స తర్వాత బాగానే ఉందని, అడవిలో వదిలిపెట్టినట్లు రేంజర్ తెలిపారు.

పోలీసు నిబంధనలకు లోబడే రాజారెడ్డి పోస్టుమార్టం

- పోస్టుమార్టం సమయంలో వీడియో చిత్రీకరణ
- రాజారెడ్డి హత్య కేసులో ఎలాంటి రాజకీయ కోణం లేదు
- తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
- ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : పోలీసు నిబంధనలకు లోబడి, చట్టప్రకారమే డాడీ హోం రాజారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన డాడీహోం రాజారెడ్డి హత్యకేసుకు సంబంధించి ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పోలీసులపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ కేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదని, పోస్టుమార్టం హడావుడిగా చేశారని, పోస్టుమార్టం సమయంలో వీడియో చిత్రీకరణ జరగలేదని.. ఇలా ఇతర ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఏఎస్పీ కేసు దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజారెడ్డి హత్య కేసుకు సంబంధించి నిరాధార ఆరోపణలను ప్రచారం చేయొద్దన్నారు. వీటిని ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో కూడా పొలిటికల్ హత్యలు జరుగుతాయని చెప్పిన వారిపై సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి నోటీసులు జారీ చేశామన్నారు. ఆరోపణలకు సంబంధించి ఆధారాలుంటే సంబంధిత పోలీసు అధికారులకు ఇస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. రాజారెడ్డి హత్యలో రాజకీయ కోణం లేదన్నారు. కేవలం ఆస్తి గొడవల కారణంగానే ఈ హత్య జరిగిందని తెలిపారు. ఇది రాజకీయ హత్య అని ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. పోలీసుల విచారణ పక్కాగా, జాప్యం లేకుండా జరిగిందని తద్వారా వెంటనే నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారన్నారు.

పోలీసు నిబంధనలను పాటించాం

రాజారెడ్డి హత్య కేసులో ఐపీసీ, సీఆర్‌పీసీ నిబంధనలను పాటించామన్నారు. మొదటగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని రిక్విజేషన్‌లో కూడా స్పష్టంగా రాసి ఆస్పత్రి వైద్యాధికారులకు ఇచ్చామన్నారు. పోస్టుమార్టం సమయంలో ఫొటో, వీడియో చిత్రీకరణ కూడా చేశామని తెలిపారు. మొదటి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించిన తర్వాత విచారణ చేస్తున్న పోలీసు అధికారులకు కొన్ని సందేహాలు వచ్చాయన్నారు. ఇదే విషయాన్ని కడప ఎస్పీ అన్బురాజన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య బృందంతో రీ పోస్టుమార్టం నిర్వహించామన్నారు. రీ పోస్టుమార్టం నిర్వహణలో ఇతరుల ప్రమేయం, ఒత్తిడి లేదని పేర్కొన్నారు. రెండోసారి నిర్వహించిన పోస్టుమార్టంలో రాజారెడ్డి హత్యకు గురైనట్లు తేలిందన్నారు. ఇందులో వైద్యుడి పాత్ర ఉందని తేలడంతో కేసులో ఏ–5 నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేశామని ఏఎస్పీ తెలిపారు. శ్రీధర్‌రెడ్డి భార్య ప్రసన్న హత్య జరిగిన సమయంలో డాక్టర్‌కు రెండు సార్లు ఫోన్ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో పూర్తిస్థాయి, లోతైన దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో సీఐలు రాజారెడ్డి, నారాయణయాదవ్, ఎస్‌ఐలు అమర్‌నాథ్‌రెడ్డి, రెడ్డిసురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

కారు, లగేజ్ ఆటో ఢీ

– ఒకరికి తీవ్రగాయాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని రామతీర్థం వద్ద ఉన్న కడప–చెన్నై జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, లగేజ్ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసు వివరాల మేరకు...కడప నుంచి అరవపల్లికి వెళుతున్న ఏపీ 04 ఏజీ 5778 నంబర్ గల కారు, కోడూరు నుంచి కడపకు వెళుతున్న ఏపీ 02 టీడీ 3251 నంబర్ గల లగేజ్ ఆటో స్థానిక రామతీర్థం వద్ద ఉన్న జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో కారులో ఉన్న అరవపల్లికి చెందిన ఖాదర్ వలీకి(60) తీవ్ర గాయాలయ్యాయి. కారులో డ్రైవింగ్ చేస్తున్న సమీప బంధువుకు స్వల్ప గాయాలు అయ్యాయి. అలాగే లగేజ్ ఆటో డ్రైవింగ్ చేస్తున్న నాగభూషణంరెడ్డికి(51) కాళ్లు విరిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్ రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.